
సాక్షి
బాపట్ల
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023





## శివలింగ ప్రతిష్టకు అంకురార్పణ

కారెంపూడి: చింతపల్లి మడేలయ్య స్వామి ఆలయంలో శివలింగ ప్రతిష్టకు బుధవారం అంకురార్పణ చేశారు. మహిళలు జల బిందెలతో శివలింగాన్ని అభిషేకించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.20 అడుగుల వద్ద ఉంది.

## మేయర్‌గా బాధ్యతల స్వీకారం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం మేయర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ జి.జ్యోతిలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### ముగిసిన అమరేశ్వరుని పవిత్రోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో జరుగుతున్న స్వామి పవిత్రోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. చివరి రోజు మండప పూజలు, మండప దేవతాహోమాలు, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మార్జనం, ఆశీర్వచనం నిర్వహించారు. దాతలు యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి సహకారంతో నిర్వహిస్తున్న ఈ పవిత్రోత్సవాలలో మూడోరోజున మండప పూజలు నిర్వహించిన అనంతరం ఉపాలయాలలో పూజలు చేశారు. తర్వాత మండప దేవతా హోమాలు నిర్వహించారు. ప్రాయశ్చిత్త హోమం పూర్ణాహుతి నిర్వహించి పవిత్రోత్సవాలను ముగించారు. కలశానికి ఉద్వాసన చేసి కలశాలలోని పుణ్యజలాలతో స్వామికి అవబృత అభిషేకం నిర్వహించారు. మూడు రోజులపాటు రుత్వికులు ధరించిన పవిత్రాలను విసర్జించి స్వామికి విశేషాలంకారం చేశారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించారు.

### నేడు ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సీఐడీ (క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం గుంటూరు నగరంలోని హోటల్ గ్రాండ్ నాగార్జునలో 'ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ సాధికారిత–వారిపై జరిగే దాడులను ఎలా నివారించాలనే అంశం'పై సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సదస్సు జరగనుంది. ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి పార్థసారథి, గౌరవ అతిథిగా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ జడ్జి శరత్‌బాబు, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు, ఎస్సీ ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) శారదామణి, ఏపీ సీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్, ఎస్పీలు సరిత, ఫకీరప్ప, సీఐడీ స్టాండింగ్ కౌన్సిల్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ఝాన్సీలక్ష్మి, సీఐడీ న్యాయ సలహాదారు లక్ష్మణరావు తదితరులు హాజరై ప్రసంగించనున్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ఏం చెబుతుంది? ఎస్సీలపై జరిగే దాడులను ఎలా నివారించాలి? ఒకవేళ కేసులు నమోదైతే ఎలా విచారణ చేపట్టాలి? వారు పోలీస్‌స్టేషన్లకు వెళ్తే ఎలా ప్రవర్తించాలి? జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏం చెబుతుంది? సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఏంటి? అనే పలు అంశాలపై ఎస్సీ/ఎస్టీ సెల్ అధికారులు, మహిళా పోలీసులు, విద్యార్థులకు సదస్సులో అవగాహన కల్పించనున్నారు.

### జాతీయ షటిల్ పోటీలకు ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులు



నాదెండ్ల: చిలకలూరిపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఇద్దరు ఉద్యోగులు జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు తెలిపారు. జాతీయ స్పోర్ట్స్ డే సందర్భంగా ఆగస్టు 29న విశాఖపట్నం ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియంలో పోటీలు జరిగాయి. ఏపీ స్టేట్ నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. వీరిలో గణపవరం గ్రామానికి చెందిన కండక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, చిలకలూరిపేటకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఉన్నారు. వీరు ఈనెల 21 నుంచి 23 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే ఆలిండియా పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ బ్యాడ్మింటన్ పోటీలకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైన డిపో సిబ్బందిని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అభినందించారు.

### మెగా లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల తొమ్మిదిన జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కోర్టులలో జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పర్యవేక్షించాలని చెప్పారు. లోక్ అదాలత్‌లో రాజీపడే సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాదాలు, చెక్‌బౌన్స్, కుటుంబ సంబంధిత, ఎక్సైజ్ కేసులను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించాలని వివరించారు.

# పచ్చనేతల దొంగ ఓట్ల మంత్ర

**పర్చూరులో గెలుపునకు పన్నాగం**

- గత ఎన్నికల్లో జరిగిందిదే
- 1983 నుంచి ఇప్పటి వరకు పదిసార్లు ఎన్నికలు
- ఆరుసార్లు టీడీపీ, నాలుగు సార్లు కాంగ్రెస్ విజయం
- ఐదుసార్లు వెయ్యి నుంచి ఆరువేలలోపు ఓట్లతో టీడీపీ గెలుపు
- గత ఎన్నికల్లో కేవలం 1,647 ఓట్ల స్వల్ప ఆధిక్యం
- నియోజకవర్గంలో 15 వేల వరకు దొంగ ఓట్లు
- వాటి తొలగింపునకు ఫారం–7 దరఖాస్తులు

**టీడీపీ ఓట్ల దందా** రట్టు కానుంది. ఇప్పటి వరకు క్షేత్రస్థాయి నుంచే మేనేజ్ చేస్తోంది. ఎక్కడున్నా 'మన'వారిని జాబితాలో చేర్పించి పబ్బం గడుపుకుంటోంది. అవకాశం ఉన్న మేర చేర్పుల్లో పచ్చమార్కు కనిపిస్తుంది. కిందస్థాయి అధికారులు చూసిచూడనట్లు వెళ్లారు. గత కొన్నేళ్లుగా పర్చూరు నియోజకవర్గంలో ఇదే తంతు నడుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ విచారణతో దొంగ ఓట్ల లెక్క తేలనుంది.



పర్చూరులోని ప్రధాన సెంటర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పర్చూరు నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్‌కు ఫారం–7 దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. మార్టూరు, కారంచేడు, యద్దనపూడి మండలాల్లో అత్యధికంగా దొంగ ఓట్లు ఉండగా మిగిలిన మండలాల్లోనూ ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా మృతుల ఓటర్లతో పాటు నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో స్థిరపడినవారి ఓట్లు అలాగే ఉంచుకున్నారు. ఆడపిల్లలు పెళ్లి చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లినా వారి ఓట్లు తొలగించకపోగా కూతురు కుటుంబం తరపున ఓట్లు చేర్పించారు. అక్రమ ఓట్లను తొలగించాలని పర్చూరు నుంచి ఎన్నికల కమిషన్‌కు ఇప్పటి వరకు 13, 356 ఫిర్యాదులు అందాయి. దీనిపై జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది.

**దొంగ ఓట్లతోనే టీడీపీ గెలుపు..**

పర్చూరు నియోజకవర్గంలో దొంగ ఓట్లే టీడీపీ బలం. ఎన్నికల ఫలితాల గణాంకాలు చూస్తే ఈ విషయం అర్థమవుతోంది. టీడీపీ ఆవిర్భవించిన 1983 నుంచి ఇప్పటి వరకు పర్చూరు నియోజకవర్గంలో 10 సార్లు ఎన్నికలు జరిగాయి. 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించగా ఆ తరువాత 1999, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ గెలుపొందింది. నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ గెలిచిన ఆరుసార్లలో ఐదుసార్లు కేవలం వెయ్యి నుంచి ఆరు వేల లోపు ఓట్లతో మాత్రమే గెలుపొందింది. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేవలం 1,647 ఓట్లతో విజయం సాధించారు. 1985లో 1,077 ఓట్లతో, 1999లో 2,209, 1983లో 6,614 , 1989లో 6,828 ఓట్లతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో మాత్రమే ఆ పార్టీ అభ్యర్థి 10,775 ఓట్లతో విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడిన దగ్గర నుంచి 15 సార్లు ఎన్నికలు జరగ్గా కేవలం నాలుగుసార్లు మాత్రమే 10 వేలకు పై చిలుకు ఓట్లతో అభ్యర్థులు గెలిచారు. 1967, 1991లో కాంగ్రెస్ అభ్యర్థి గాదె వెంకటరెడ్డి 10 వేల పై చిలుకు ఓట్లతో గెలుపొందగా, 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు, 2014 టీడీపీ అభ్యర్థి ఏలూరు సాంబశివరావులకు 10 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ వచ్చింది.

**దొంగ ఓట్లు పోతే గెలుపు తారుమారే..**

నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగిస్తే గెలుపోటములు తారుమారయ్యే పరిస్థితి. గత ఎన్నికల ఫలితాలు చూస్తే సగటున ఆరువేల ఓట్ల మెజారిటీకి మించి ఇక్కడ ఏ అభ్యర్థి గెలుపొందలేదు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేవలం 1,647 ఓట్లతో మాత్రమే నెగ్గారు. నియోజకవర్గంలో ఇప్పటికే 13 వేల పైచిలుకు దొంగ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు అందాయి. పది వేలకు తక్కువ లేకుండా దొంగ ఓట్లు ఉంటాయని పచ్చపార్టీ నేతలే చెబుతున్నారు. విచారణ అనంతరం దొంగ ఓట్లను తొలగిస్తే ఇక్కడ టీడీపీకి కష్టకాలమే.

**భుజాలు తడుముకుంటున్న పచ్చనేతలు...**

వేలాదిగా వస్తున్న ఫిర్యాదులతో దొంగ ఓట్లపై ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా స్వయంగా విచారణ చేపట్టారు. దీంతో ఉలిక్కిపడిన టీడీపీ నేతలు తమ పార్టీకి చెందిన ఓట్లను తొలగిస్తున్నారంటూ రాద్ధాంతానికి దిగారు. తమకున్న పచ్చపత్రికలు, సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని నానాయాగీ చేశారు. దొంగే.. దొంగ.. దొంగ అన్నట్లుగా ఎన్నికల కమిషన్‌ను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. మరో వైపు దొంగ ఓట్లపై ఫిర్యాదులు పెరిగాయి. పర్చూరులో ఇప్పటి వరకు దొంగ ఓట్ల పుణ్యమాని అరకొర మెజార్టీతో నెగ్గుకు వస్తున్న టీడీపీకి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. ఏమి చేయాలో పాలుపోక ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఎలాగైనా దొంగ ఓట్లను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

## ● 'ఉట్టి'పడిన ఉత్సవం





గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ ఎనిమిదో లైనులో యువత నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ఉట్టి కొట్టి అబ్బురపరిచారు. కృష్ణ భగవానుడికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

– నాదెండ్ల

# నకరికల్లులో భారీ చోరీ

**20 సవర్ల బంగారం, రూ.7.5 లక్షల నగదు అపహరణ**

నకరికల్లు(పల్నాడు జిల్లా): ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.7.5 లక్షలు అపహరించారు. ఈ ఘటన స్థానిక ఇందిరమ్మ కాలనీలో మంగళవారం జరిగింది. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ కథనం.. నకరికల్లుకు చెందిన షేక్ కరీమ్‌బాషా కుటుంబం ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటుంది. బాషా భార్యకు పురిటినొప్పులు రావడంతో మధ్యాహ్నం ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులంతా నరసరావుపేటలోని వైద్యశాలకు వెళ్లారు. తిరిగి ఆదేరోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. 20 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.7.5 లక్షలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనాస్థలాన్ని ఎస్ఐ ఎ.బాలకృష్ణ పరిశీలించారు. బుధవారం డీఎస్పీ బి.ఆదినారాయణ, రూరల్ సీఐ పి.ప్రేమయ్య నకరికల్లుకు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల వద్ద వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. డీఎస్పీ బి.ఆదినారాయణ మాట్లాడుతూ గుర్తుతెలియని దుండగులు నగదు, బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# కోర్టులో భద్రత కట్టుదిట్టం

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కానిస్టేబుల్ నియామకం
- గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ వెల్లడి

గుంటూరు లీగల్: 'గుంటూరు జిల్లా సెషన్స్ కోర్టులో క్రిమినల్ కేసుల విచారణ జరుగుతుంటుంది. ఇక్కడ హైకోర్టు కన్నా భద్రతా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది' అని గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చెప్పారు. బుధవారం ఆయన గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణాన్ని సందర్శించారు. కోర్టులో మొత్తం ఎన్ని గేట్లు ఉన్నాయి, రాకపోకలు ఎక్కువగా ఉన్న గేట్లు ఏవి, మూసి ఉన్న గేట్లు ఎన్ని అనేది ఎస్పీ పరిశీలించారు. ఆయన కాలినడకన కోర్టులో కలియతిరిగారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీకే సురేష్, ఇతర న్యాయవాదులతో మాట్లాడారు.

**నాలుగు ద్వారాలు సరిపోతాయి..**

గుంటూరు జిల్లా కోర్టుకు మొత్తం 7 గేట్లు ఉన్నాయని, దీనిలో మూడు గేట్లు మూసేసి, 4 గేట్లు ఉపయోగిస్తే సరిపోతుందని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అభిప్రాయ పడ్డారు. అలాగే అక్కడ ఉన్న న్యాయవాదుల ఐడీ కార్డులను పరిశీలించారు. వీటిని సులభంగా డూప్లికేట్ తయారు చేయవచ్చని చెబుతూ డిజిటల్ కార్డులు లేవా అని ప్రశ్నించారు. కోర్టులో వాహనాలను అడ్డదిడ్డంగా పెడుతున్న తీరును గమనించిన ఎస్పీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించనున్నట్లు వివరించారు. జిల్లా కోర్టు బయట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనుమతులు రాగానే కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోర్టు బయట ప్రాంతంలో మీడియ పాయింట్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

**కోర్టు కానిస్టేబుళ్లను మార్చండి**

ఏళ్ల తరబడి పని చేస్తున్న కోర్టు కానిస్టేబుళ్లను మార్చాలని గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీకే సురేష్, ఎస్పీని కోరారు. 7 నుంచి 12 ఏళ్ల నుంచి పని చేస్తున్న దాదాపు 17 మందిని మార్చాలని సూచించారు. ఆరోపణలు ఏమైనా ఉంటే విచారణ చేసి నిజమని తేలితే మారుస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

# గుంటూరు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు



కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తాడికొండ మండలంలో 55.6 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 14.6 మి.మీ వర్షం పడింది. సగటున 30.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... మేడికొండూరు 48, ప్రత్తిపాడు 47.2, కాకుమాను 45, దుగ్గిరాల 44.8, ఫిరంగిపురం 36.4, మంగళగిరి 34.6, పెదకాకాని 33.2, తుళ్ళూరు 32, పొన్నూరు 27.8, వట్టిచెరుకూరు 22.4, చేబ్రోలు 18, కొల్లిపర 17.6, తెనాలి 17.4, పెదనందిపాడు 17.2, గుంటూరు తూర్పు 16, గుంటూరు పశ్చిమలో 15.8 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబరు మాసం 6వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 28.1 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 87.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితాపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

- ఎక్కడా లోపాలకు తావు లేకుండా చర్యలు
- ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు రూరల్: స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని చల్లావారిపాలెం, గోరంట్ల గ్రామాల్లో తొలగించిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లు, కొత్త ఓటర్ల నమోదుపై బుధవారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి విచారణ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. 2020 జనవరి 6 నుంచి 2023 జూలై 20వ తేదీ వరకు జరిగిన మార్పులు, చేర్పులపై విచారణ చేశారు. సిబ్బంది పారదర్శకంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేశారా లేదా అనేది నిర్ధారించారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ పకడ్బందీగా జరుగుతున్నట్టు వివరించారు. పథకాల అమలుపైనా స్థానికులను కలెక్టర్ ఆరా తీశారు. చల్లావారిపాలెంలో షేక్. మస్తాన్‌బి తనకు ఇటీవల డ్వాక్రా రుణం రూ.1.50 లక్షలు అందిందని, అయితే తనకు వితంతు పెన్షన్ రావట్లేదని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్‌కు ఫోన్ చేసి వితంతు పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, గుంటూరు తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు నగేష్, సాంబశివరావు, వీఆర్‌ఓ గాయత్రి, బీఎల్‌ఓలు సల్మా, అరుణ కుమారి పాల్గొన్నారు.

# వాయుష్మాన్‌భవ

- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరుకు జాతీయ స్థాయి గుర్తింపు
- దేశంలోనే మూడో స్థానం కైవసం
- పచ్చదనం పెంపు, ప్రధాన రహదారుల శుభ్రతకు దక్కిన గౌరవం
- నేడు భోపాల్‌లో అవార్డు అందుకోనున్న మేయర్, కమిషనర్



సు'వనో'హరం : ఆర్టీసీ కాలనీలో గ్రీనరీతో నిండి ఉన్న ఉద్యానవనం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు లభించింది. గత ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో 6వ స్థానం సాధించింది. మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో ప్రగతిపై నిర్వహించిన సర్వేలో గుంటూరు తన కీర్తి పతాకను రెపరెపలాడించింది. ఈ సర్వేలో రాష్ట్ర స్థాయిలో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లయిన విశాఖపట్నం, విజయవాడలనూ సైతం పక్కకునెట్టి మొదటి స్థానంలో నిలిచింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్)–స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ దక్కింది. దక్షిణ భారతదేశంలో గుంటూరు నగరానికి మాత్రమే ఈ సర్వేలో ర్యాంకు దక్కడం గర్వకారణం.

**పోటీలో 131 నగరాలు**

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో దేశవ్యాప్తంగా 131 నగరాలు పోటీ పడ్డాయి. అందులో 10 లక్షలలోపు జనాభా కేటగిరిలో గుంటూరు నగరానికి 3వ ర్యాంక్ దక్కింది. ఈ కేటగిరిలో తొలి మూడు స్థానాల్లో వరుసగా అమరావతి(మహారాష్ట్ర), మొరాదాబాద్(ఉత్తరప్రదేశ్), గుంటూరు నగరాలు నిలిచాయి. దక్షిణ భారతదేశంలో ఈ ఖ్యాతి ఒక్క గుంటూరు నగరానికే దక్కడం గర్వకారణం. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి 131 నగరాల్లో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో భాగంగా వివిధ అంశాలను పరిశీలించింది. 2023–24 ఆర్థిక ఏడాదికి ఉత్తమ నగరాలకు అవార్డు అందించాలని సిఫార్సు చేసింది. దీనిలోభాగంగా సెప్టెంబర్ 7న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి చేతుల మీదుగా నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి పురస్కారం అందుకోనున్నారు.



'మొక్క'వోని సంకల్పం : నందివెలుగు రోడ్డులోని సెంట్రల్ మీడియన్స్‌లో సుందరంగా మొక్కలు

**మెరుగైన ర్యాంకుకు కారణాలివే..**

- 2021 నాటికి 17 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 30 శాతానికి పెంచడం
- మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం
- గతంలో సెంట్రల్ మీడియన్స్‌లో పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న మొక్కల పెంపకాన్ని 23 కిలోమీటర్లకు పెంచడం, సుందర ఉద్యానవనాలు.
- గతంలో 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఎవెన్యూ ప్లాంటేషన్‌ను ప్రస్తుతం 30 కిలోమీటర్లకు పెంచడం
- పాట్ హోల్స్ మరమతులు
- డ్రెయిన్ టు డ్రెయిన్ రోడ్ల నిర్మాణం
- ప్రధాన రహదారులను స్వీపింగ్ యంత్రాలతో శుభ్రం చేయడం
- గాలి కాలుష్యం తగ్గించడం.
- మిస్ట్ స్ప్రేయర్స్, ఘన వ్యర్థాల నిర్వహణ మెరుగుదల
- తడి చెత్తను కంపోస్టింగ్, పొడి చెత్తను రీ సైక్లింగ్, రీ సైక్లింగ్ కాని వ్యర్థాలను జిందాల్ పవర్ ప్రాజెక్టుకు ప్రణాళికాబద్ధంగా పంపడం

**గర్వకారణం**



గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వకారణం. గత సంవత్సరం సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో 6వ స్థానంలో నిలిచాం. ప్రస్తుతం స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో 3వ స్థానం రావడం శుభపరిణామం. పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారుల సంయుక్త కృషితోనే గుంటూరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

– కావటి మనోహర్‌నాయుడు, నగర మేయర్

**పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం**



గుంటూరు నగరంలో పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పార్కులు, సెంట్రల్ డివైడర్లు, ఐలాండ్స్ అభివృద్ధికి పెద్దపీట వేశాం. తడి చెత్తను కంపోస్ట్, పొడి వ్యర్థాలను రీ సైక్లింగ్, మిగిలిన వ్యర్థాలను విద్యుదుత్పత్తికి ప్రణాళికాబద్ధంగా పంపాం. దీనివల్ల జాతీయ స్థాయి గౌరవం దక్కింది. ఇదే స్ఫూర్తితో పాలకవర్గం, ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలతో నగరానికి మరింత కీర్తి తీసుకొస్తాం.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

క్లుప్తంగా

## రాష్ట్ర పోటీలకు జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31వ తేదీని నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ ఆధారంగా జట్టును ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. ఈ నెల 15వ తేదీ ఉదయం స్థానిక బీఆర్ స్టేడియంలోని తమ కార్యాలయంలో పూర్తి వివరాలతో సంప్రదించాలని కోరారు.

**ఎంపికైన క్రీడాకారులు..**

**అండర్–14 బాలురు..** ఎ.ధర్మరాజు, వై.సతీష్, ఎస్‌కె.నూర్, వి.బాలాజీ

**బాలికలు–** ఎండీ కరిష్మా, ఎస్.వహిత, జి.పావని, పి.హాసిని, జి.దీపిక

**అండర్–16 బాలురు..** జి.మోహన్, ఎస్.ఇమామ్‌వలి, డి.శామ్యూల్, పి.ఆకాష్, పి.శ్రీనివాసరావు, ఎస్‌కే హమీద్, ఎం.అఖిల్ వర్ధన్, ఎస్‌కే అస్లాం, వరుణ్, స్వరూప్ కుమార్ పాత్ర, పాల్‌రాజ్, వై.వీరేంద్ర, జె.పవన్‌తేజ, పీవీ సత్యనారాయణ, జి.అభిషేక్ లారెన్స్

**బాలికలు–** రూపాలికా పాత్ర, ఎండీ ఆశియా, ఎం.లీలాప్రవల్లిక, వి.ఉషశ్రీ, వై.నాగయోచన, జి.శ్రీలత, కె.దీప్తి, యామిని అనూష, ఇందుమతి, మెహరాజ్, ఇ.హేమశ్రీ, వి.ప్రియాంక, ఎవి.సుష్మ, ఎం వి.శివపార్వతి.



# విద్యార్థులకు మెరుగైన బోధనే లక్ష్యం

- రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రమేష్‌కుమార్
- ట్యాబ్‌లు వినియోగించకపోవడంపై అసంతృప్తి


విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న రమేష్‌కుమార్

సత్తెనపల్లి(ముప్పాళ్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సాంకేతిక విద్య(ట్యాబ్స్, ఐఎఫ్‌బీ) రాష్ట్ర నోడల్ ఆఫీసర్ సీహెచ్‌వీఎస్ రమేష్‌కుమార్ కోరారు. సత్తెనపల్లి మండలంలోని రామకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పాఠశాలలో పూర్తి స్థాయిలో బోధన, ట్యాబ్‌ల నిర్వహణ జీరో యూసేజ్‌గా ఉన్నట్లుగా గుర్తించారు. గత ఏడాది విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు కూడా సక్రమంగా వాడటం లేదని తనిఖీల్లో నిర్ధారించుకున్నారు. ఉపాధ్యాయులు అలసత్వమే కారణంగా భావిస్తూ, ట్యాబ్‌లను పరిశీలించగా అవన్నీ ఒక గదిలో ఉన్నట్లుగా గుర్తించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బోధన చేసేందుకు విద్యార్థులకు అందిస్తే, నిర్వహణ సక్రమంగా లేకపోవటం బాధాకరమన్నారు. కార్పొరేట్ స్థాయిలో పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ నిర్వహించేందుకు అవసరమైన ఫర్నీచర్, ల్యాప్‌టాప్‌లు అందించినా ఇంత వరకు ల్యాబ్ ప్రారంభించకపోవటం అలసత్వానికి నిదర్శనమని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఐఎఫ్‌బీ(మానిటర్)లు తమకు అందలేదని పాఠశాల ప్రిన్సిపాల్ జాన్సన్ వారి దృష్టికి తీసుకురాగా, అప్పటికప్పుడు పరిసర ప్రాంత పాఠశాలల్లో ఇన్‌స్టలేషన్ కానటువంటి పది ఐఎఫ్‌బీలను తెప్పించి పాఠశాల తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. రేపటి నుంచి పాఠశాలలో ఐఎఫ్‌బీ విధానంలోను బోధన చేపట్టాలని ఆదేశించారు. గత ఏడాది అందించిన వాటిల్లో పగిలిపోయిన మూడు ట్యాబ్‌లను రిపేర్ చేసి అన్ని ట్యాబ్‌లు సక్రమంగా పనిచేసేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి విద్యార్థులకు అందించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేట్ నోడల్ ఆఫీసర్ సీహెచ్‌వీఎస్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో అనుకున్న మేర బోధన జరగటం లేదని గుర్తించామని, అదే విషయాన్ని సోషల్ వెల్ఫేర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇక్కడ గుర్తించిన అంశాలపై నివేదిక అందించి విద్యార్థులకు మెరుగైన సాంకేతికవిద్యా బోధన జరిగేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. తనిఖీల్లో జిల్లా నోడల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, టెక్టోరా కంపెనీ సీనియర్ మేనేజర్ సుమన్, నందన్ పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్‌లో వీఐటీకి బంగారు పతకం



తాడికొండ: ఇంటర్ యూనివర్సిటీ ఇన్విటేషనల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పురుషుల జట్టు బంగారు పతకం సాధించినట్లు వీఐటీ–ఏపీ విశ్వ విద్యాలయం వీసీ ఎస్‌వీ కోటా రెడ్డి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 29వ తేదీన విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ ఇన్విటేషనల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో తమ కళాశాల జట్టు కేఎల్‌యూ, ఎస్‌ఆర్‌ఎం, ఎంబీ, విజ్ఞాన్ యూనివర్సిటీ జట్లను ఓడించి బంగారు పతకం, సర్టిఫికెట్‌లు, చాంపియన్ ట్రోఫీతో పాటు రూ.10 వేలు నగదు బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటా రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.రామచంద్రరావు, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ జి.దయానంద్ అభినందించారు.

### నేడు 'సైకిల్ థాన్ - వాక్ థాన్'

పటమట(విజయవాడతూర్పు): నగరంలో స్వచ్ఛమైన గాలి, నిర్మలమైన ఆకాశం లక్ష్యంగా నాలుగో అంతర్జాతీయ స్వచ్ఛ గాలి, నీలి ఆకాశ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో సైకిల్ థాన్ – వాక్ థాన్ నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు లబ్బీపేట ఈట్ స్ట్రీట్ నుంచి ప్రారంభించి బెంజి సర్కిల్ వరకు సైకిల్ థాన్ – వాక్ థాన్ కొనసాగుతుందన్నారు. పర్యావరణ అనుకూలమైన రవాణా విధానాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని లక్ష్యంగా పెట్టుకోవాలని సైకిల్ థాన్ – వాక్ థాన్ ద్వారా సందేశాన్ని ఇస్తూ ర్యాలీని చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అయ్యేందుకు ర్యాలీలో నగరవాసులు పాల్గొనాలని ఆయన కోరారు.

# కాలువలో పడి యువకుడు దుర్మరణం


బోడపాటి రామ్‌పవన్ (ఫైల్)

కొల్లూరు: కాలువలో పడి యువకుడు దుర్మరణం పాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. చెరుకుపల్లి మండలం పులిగడ్డవారి పాలేనికి చెందిన బోడపాటి శ్రీనివాసరావు కుమారుడు బోడపాటి రామ్‌పవన్(21) నగరంలో డిగ్రీ చదువుతున్నాడు. కళాశాలకు సెలవు కావడంతో తమ గ్రామస్తులతో కలసి కొల్లూరు మండలంలోని చినపులివర్రులో మొక్కజొన్న లోడ్ చేసేందుకు వచ్చాడు. లారీ లోడ్ చేసిన అనంతరం కోటిపల్లి వద్ద పశ్చిమ బ్యాంక్ కెనాల్ ర్యాంపు వద్ద కాలువలో దిగి శరీరం శుభ్రం చేసుకునేందుకు ఉపక్రమించాడు. ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో నీటి ఉధృతికి కొట్టుకుపోతుండగా తోటి కూలీలు, స్థానికులు కాపాడేందుకు పయత్నం చేశారు. ఫలితం లేకుండా పోయింది. భట్టిప్రోలు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి యువకుడి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు భట్టిప్రోలు ఎస్‌ఐ చంద్రశేఖరరావు కేసు నమోదు చేశారు.

# దిగజారుడుకు పరాకాష్ట చంద్రబాబు

మంత్రి మేరుగ నాగార్జున



భట్టిప్రోలు: మాజీ సీఎం చంద్రబాబు దిగజారుడుతనానికి పరాకాష్ట అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు మార్కెట్ యార్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాబు నైజం మొదటి నుంచి కోర్టుల దగ్గర స్టేలు తెచ్చుకుని బతకడమేనని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో చంద్రబాబు ఇంత దిగజారుడు తనానికి పాల్పడతారని ఎవరూ అనుకోలేదని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నోటీసులు ఇస్తుందో తెలియనంత దద్దమ్మ చంద్రబాబు అని పేర్కొన్నారు. అమరావతిలో చంద్రబాబు డొల్ల కంపెనీల పేరుతో డబ్బులు కాజేసింది వాస్తవమా కాదా అని అన్నారు. ఇందులో ఎవరెవరు ఎలా శ్రీనివాస్ దొరికాడో... అలాగే ఆయన కుమారుడు కూడా దొరకుతాడని చెప్పారు. కోట్ల రూపాయలు దోచుకుని గుడ్డ కాల్చి వైఎస్సార్ సీపీ నెత్తిన వేయడం చాలా తప్పని హితవు పలికారు.

# రైల్వే ప్రజెంటింగ్ కార్యాలయం ప్రారంభం


ప్రజెంటింగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అరండల్‌పేటలో రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అనుబంధ కార్యాలయం (ప్రజెంటింగ్ కార్యాలయం) నూతన భవనం ప్రారంభించడం అభినందనీయమని డివిజనల్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. అరండల్‌పేటలోని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అనుబంధ నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే శాఖకు సంబంధించి డివిజన్ పరిధిలో ఉన్న రైల్వే కేసుల గురించి చర్చించేందుకు రైల్వే ప్రజెంటింగ్ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అన్ని రకాల వసతులు, అత్యాధునిక పరికరాలతో డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలో నూతన భవనాల్లో అన్ని సదుపాయాలు సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యాలయంలో గదులను పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ గతిశెట్టి.ఆర్.శ్రీనివాస్, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సీనియర్ డీఈఎస్ కో–ఆర్డినేటర్ దేవిఅనూష, సీనియర్ డీఈఈ దినేష్‌రెడ్డి, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్, డీసీఎం కమలాకర్ బాబు పాల్గొన్నారు.

# క్రైస్తవ, ముస్లింలపై దాడులు అరికట్టాలి

ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ సుందరబాబు


సంఘీభావం తెలియజేస్తున్న క్రైస్తవ, ముస్లిం నాయకులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): బీజేపీ పాలనలో రోజురోజుకు దేశంలో క్రైస్తవ, ముస్లింలపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడులను అరికట్టాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గొల్లమూడి రాజసుందరబాబు డిమాండ్ చేశారు. గుంటూరు నాజ్‌సెంటర్‌లో క్రైస్తవ, ముస్లిం నాయకుల ముఖ్య సమావేశం బుధవారం నిర్వహించారు. రాజసుందరబాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మతోన్మాదులు మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. గత నెల 8న పాస్టర్ నెహెమ్యా, పాస్టర్ జాన్సన్‌లపై మతోన్మాదులు దాడి చేసి గాయపరిచారని, దీనిపై పోలీసులు కూడా దాడి చేసిన వారికే మద్దతు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు వారికి వత్తాసు పలికే పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా క్రైస్తవ, ముస్లిం భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసే యూసీసీ చట్టం అమలుకు కేంద్రం అడుగులు వేస్తున్న నేపథ్యంలో యూసీసీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన సమయం అసన్నమైందన్నారు. ముస్లిం వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ దేశంలో మతన్మోదులు, ఆర్‌ఎస్‌ఎస్ వాదులు సృష్టిస్తున్న హింసలకు బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. యూసీసీపై చర్చిలు, మసీదులల్లో భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ, ముస్లిం నాయకులు పాస్టర్ సహదేవ్, పాస్టర్ షేక్ మాదాన్, పాస్టర్ మల్లె రాజు, ఎండీ అప్సర్, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, మల్లవరపు రవిరాజా, ఆనంద్‌పాల్ పాల్గొన్నారు.



# కన్న తల్లే కడతేర్చింది!

- తాగుబోతు కుమారుడి చేష్టలు భరించలేక ఘాతుకం
- కూతురు, మరో వ్యక్తితో కలసి హత్య
- ఆపై సాధారణ మృతిగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం తాగి తరచూ తల్లిని వేధింపులకు గురిచేస్తున్న కుమారుడిని హత్య చేసిన ఘటనలో తల్లి, మైనర్ బాలికతో పాటు ఖలీమ్ ఆలీఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గత నెల 27వ తేదీన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందగా, తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తల్లి చెప్పిన కొన్ని అంశాలు అనుమానాస్పదంగా అనిపించడంతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేశారు. తొలుత అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడికి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారా అనే దిశగా దర్యాప్తు చేపట్టారు. దీంతో తల్లే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు నిర్ధారించారు. దీనికి సంబంధించి సీఐ చెప్పిన వివరాలు ఇవి..

కొత్తపేటకు చెందిన మద్దూరి దేవకుమార్(19) చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లో తల్లి మాధవిని వేధించేవాడు. దేవకుమార్ తాను పని చేస్తే వచ్చే డబ్బులతో పాటు తల్లి హోటల్‌లో పని చేసి సంపాదించిన డబ్బులను కూడా ఇవ్వాలని తరచూ బెదిరింపులకు పాల్పడేవాడు. కుమారుడి వేధింపులు ఎక్కువ కావడంతో తల్లి మాధవి తీవ్రంగా ఆందోళన చెందేది. ఈ క్రమంలో గత నెల 27వ తేదీ ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన దేవకుమార్ తల్లిని బెదిరించాడు. అర్ధరాత్రి వేసి గ్యాస్ లీక్ చేసి చంపేస్తానన్నాడు. దీంతో తల్లి భయంతో పక్కనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లిపోయింది.

**తెల్లవారుజామున హత్య..**

అర్ధరాత్రి బంధువుల ఇంటికి వెళ్లిపోయిన మాధవి ఇంట్లో జరిగిన గొడవను తనతో పాటు హోటల్‌లో పని చేసే తాడేపల్లి మహానాడుకు చెందిన ఖలీమ్ ఆలీఖాన్‌కు చెప్పింది. దీంతో ఎలా అయినా దేవకుమార్‌ను వదిలించుకోవాలని నిర్ణయించుకుని తల్లి మాధవి, తన కుమార్తెతో కలిసి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి వద్దకు వచ్చిన ఆలీఖాన్‌తో కలిసి మంచంపై నిద్రస్తున్న దేవకుమార్ కాళ్లు, చేతులు తలో వైపు పట్టుకోగా, గొంతు నులిమి హత్య చేశారు. తెల్లవారుజామున అక్కడి నుంచి వెళ్లిన మాధవి ఉదయం వచ్చి తన కుమారుడు చనిపోయాడని అందరిని నమ్మించే ప్రయత్నం చేసింది. చివరకు పోలీసుల విచారణలో జరిగిన వ్యవహారం అంతా బయటకు వచ్చింది. హత్యకు పాల్పడిన మాధవి(45), బాలిక(17)తో పాటు ఆలీఖాన్(33)ను పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

# యువకుడిని నిర్బంధించి దాడి

- పెట్రోల్ బంకు వద్ద స్వల్ప వివాదం
- దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదుకు డిమాండ్
- పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన

కొల్లూరు: పెట్రోల్ బంక్‌లో ఇద్దరి యువకుల మధ్య వివాదం ఓ యువకుడ్ని నిర్బంధించి దాడి చేసిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని సుగ్గునలంకకు చెందిన శీలం గోపి స్థానిక బాలురోన్నత పాఠశాల వద్ద నున్న పెట్రోల్‌బంక్‌లో బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చాడు. బంక్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఎంత పెట్రోల్ కొట్టాలో ప్రశ్నించగా, రూ.5 వేలది కొట్టమని వాహనదారుడు బదులిచ్చాడు. అదే సమయంలో పెట్రోల్ కోసం వచ్చిన చిలకా చిట్టిబాబు వెటకారపు సమాధానం ఏమిటంటూ గోపి అనే యువకుడ్ని ప్రశ్నించడంతో వివాదం చోటుచేసుకుంది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీయడంతో గోపి తన బైక్ కీ చైన్ చాకును తీసి చిట్టిబాబుపై దాడి చేయడంతో చేతిపై గాయమైంది. వెంటనే చిట్టిబాబు స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న యువకులు గోపిని నిర్బంధించి తమ వెంట ఎస్సీ కాలనీకి తీసుకుని వెళ్లి అక్కడ ఓ గుంజకు కట్టేసి దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి, యువకుడిని విడిపించి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్సీ కాలనీకి చెందిన స్థానికులు భారీగా స్టేషన్‌కు చేరుకుని తక్షణం చాకుతో దాడి చేసిన గోపిపై కేసు నమోదు చేయాలని ఆందోళన చేపట్టారు. అదే సమయంలో స్టేషన్‌కు చేరుకున్న ఎస్‌ఐ, చట్టప్రకారం తప్పున్న వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన వారిపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొట్లాట జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయకుండా యువకుడ్ని తీసుకెళ్లి నిర్బంధించి దాడి చేయడం చట్టరీత్యా నేరమని, చట్టాన్ని చేతులోకి తీసుకోవడం, స్టేషన్ వద్ద ఆందోళన చేయడం తగదని హెచ్చరించడంతో ఆందోళనకు దిగిన ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన విరమించారు. కొట్లాటలో చేతికి గాయమైన చిట్టిబాబును 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై ఇద్దరు ఫిర్యాదులు తీసుకుని కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ రాజ్యలక్ష్మి తెలిపారు.

# దుర్గమ్మ సన్నిధిలో మరో యాగశాల

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో మరో యాగశాల నిర్మించేందుకు దేవస్థాన అధికారులు సన్నాహాలు చేపట్టారు. ప్రస్తు తం దేవస్థానంలో రెండు యాగశాలలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి నిత్యం చండీహోమం నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. మల్లేశ్వర స్వామి ఆలయం మెట్ల మార్గంలో ఉన్న రెండో యాగశాలలో హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాత లడ్డూ పోటు, ప్రస్తుతం ఉన్న రాధాకృష్ణుల విగ్రహాల సమీపంలో స్థలం నిరుపయోగంగా ఉంది. ఈ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలనే భావనతో భారీ యాగశాల నిర్మాణానికి దేవస్థానం కార్యాచరణ రూపొందించింది. ఈ యాగశాల నిర్మించేందుకు దాత నరసింహారావు ముందుకు రావడంతో పనులు చేపడుతున్నారు. గురువారం యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన, పూజలు నిర్వహించేలా అర్చకులు ముహూర్తం ఖరారు చేశారు.

# యూరియాను ఎఫ్‌ఓఎల్ ద్వారా సరఫరా చేయాలి

ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి


కొరిటెపాడు(గుంటూరు): ప్రైవేటు డీలర్లు రైతు భరోసా కేంద్రాల నుంచి యూరియా కొనుగోలు చేయడం పెద్ద తప్పు అని, అలా కొనుగోలు చేసిన డీలర్లను రాష్ట్ర అసోసియేషన్ నుంచి తొలగిస్తామని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు డీలర్లకు యూరియా విక్రయించిన ఆర్‌బీకే సిబ్బందిపై వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా ప్రైవేటు డీలర్ల వద్ద లేదని, దానిని అధిగమించడానికి అవసరమైన ఏరియాలలో ప్రైవేటు వ్యాపారులకు కూడా ఎఫ్‌ఓఎల్ ద్వారా యూరియా సప్లయి చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# 'ప్రతి మహిళా సురక్షితం'.. అదే మా ధ్యేయం

జగన్నామ సంక్షేమ సంవత్సరంలో ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండడమే లక్ష్యం

- ఆదిలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చు
- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ
- మామిళ్లపల్లిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం
- 131 మందికి పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అంబటి మురళీకృష్ణ


వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళల పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

పొన్నూరు: ముందు జాగ్రత్తగా వైద్య పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్ మహమ్మారిని జయించడం సాధ్యపడుతుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో 'ప్రతి మహిళా సురక్షితం' అన్న నినాదంతో బుధవారం పొన్నూరు మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, కాలుష్యం కారణంతో మహిళలకు పలు రకాల క్యాన్సర్లు వస్తున్న నేపథ్యంలో వారికి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను బజరంగ్ ఫౌండేషన్ స్వీకరించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తమ రోజువారీ పనులతో సతమతమవుతూ ఆరోగ్యాన్ని కొంత నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మామిళ్లపల్లిలో మొట్టమొదటిసారిగా మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించే వైద్య పరీక్షలను గుంటూరు ఒమేగా హాస్పిటల్ సహకారంతో మహిళా వైద్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ అనూష వారి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నా రు. అసాధారణ రీతిలో 131 మందికి పైగా మహిళలు ఈ శిబిరానికి హాజరు కావడం విశేషం అన్నారు. ఈ శిబిరంలో ప్రాథమిక దశలో అవసరం ఉన్న వారికి మెమోగ్రామ్ పరీక్షలు, పాప్ స్మియర్ పరీక్షలు పూర్తి చేసినట్లు, ఈ రెండు పరీక్షల ఫలితాల అనంతరం, తదుపరి వైద్య సేవలకు బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాట్లు చేస్తోందని అంబటి వివరించారు.